నిత్యం పడిగాపులు


హైవే పక్కనున్న పోర్టు హాస్పిటల్

- పోర్టు హాస్పిటల్ వద్ద రోగుల అవస్థలు
- వేకువజాము నుంచే ఓపీ కోసం బారులు
- వైద్యులు వచ్చే వరకు తప్పని ఎదురుచూపులు


ఓపీ సేవల కోసం వేకువజాము నుంచి వేచి ఉన్న రోగులు, వారి సహాయకులు

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారి పక్కనే ఉన్న పోర్టు హాస్పిటల్.. ఒకప్పుడు పోర్టు ఉద్యోగులు, వారి కుటుంబాలకు అపర సంజీవని. ఎటువంటి ఆరోగ్య సమస్యయినా చిటికెలో నయం చేసేవారు. ఏ మందు కావాలన్నా క్షణాల్లో ఇచ్చేవారు. ఎప్పుడో ఓసారి బయట నుంచి మందులు తెచ్చి ఇచ్చేవారు.. బయటి హాస్పిటల్స్, డయాగ్నోస్టిక్ లాబ్స్‌కు రిఫర్ చేసేవారు.. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆరోగ్యం బాగోలేక ఈ ఆస్పత్రిలో చూపించుకోవాలంటే రోగులు, వారి సహాయకులు నిత్యం నరకం చూస్తున్నారు.

అందుబాటులో లేని అత్యవసర వైద్యులు

నాటి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్(నేటి విశాఖపట్నం పోర్టు అథారిటీ)లో పనిచేసే ఉద్యోగులు, వారి కుటుంబాలు, మాజీ ఉద్యోగుల కోసం సుమారు మూడు దశాబ్దాల కిందట పోర్టు గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. అప్పట్లో ఏ సమస్య వచ్చినా వెంటనే నయం చేసేవారు. ప్రస్తుతం ఒక చిన్న సమస్యకు పదే పదే తిరగడం, తిప్పించడం జరుగుతోంది. అత్యవసర చికిత్సలు అందించే క్యాజువాల్టీలో రాత్రి వేళల్లో అనుభవజ్ఞులైన వైద్యులు కూడా అందుబాటులో ఉండటం లేదు. కొత్తగా వచ్చిన జూనియర్ డాక్టర్లకు ఇక్కడ డ్యూటీలు వేస్తున్నారు. రాత్రి వేళ ఎవరైనా అత్యవసర సమస్యతో వస్తే తాత్కాలిక ఉపశమనం కోసం మందులు, లేదా ఇంజక్షన్ ఇచ్చి మరుసటి రోజు ఓపీలో చూపించుకోవాలని సూచిస్తున్నారు.

ప్రస్తుతం ఇదీ పరిస్థితి..

ఏదైనా ఆరోగ్య సమస్య, వ్యాధి వచ్చి పోర్టు హాస్పిటల్‌లో చూపించుకోవాలంటే తెల్లవారుజామునే వచ్చి తమ హాస్పిటల్ పుస్తకాలు లైన్‌లో పెట్టాలి. ఉదయం 8 లేదా 8.30 గంటల తరువాత నంబర్లు వేసే వ్యక్తులు వచ్చి రోగులకు ఓపీ నంబర్లు వేస్తారు. వాటి ప్రకారం ఆయా ఓపీల దగ్గర డాక్టర్లు వచ్చే వరకు పేషెంట్లు వేచి ఉండాలి. వైద్యులు వచ్చి అవసరమైన మందులు, పరీక్షలు వంటివి రాస్తారు. మందుల కోసం మళ్లీ క్యూ లైన్లు కట్టాల్సిందే. పోర్టు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఎవరైనా ఆరోగ్యం బాగోలేక ఈ ఆస్పత్రిలో కేవలం డాక్టర్‌కు చూపించుకోవడానికి తెల్లవారు 4 నుంచి మధ్యాహ్నం 12 లేదా ఒంటి గంట వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎక్కడెక్కడ నుంచో వస్తుంటారు...

దాదాపు 30 ఏళ్ల కిందట పోర్టులో పనిచేసే ఉద్యోగులందరూ సాలగ్రామపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లో ఉండేవారు. వీరంతా రిటైరయ్యాక పెందుర్తి, చినముషిడివాడ, ఎంవీపీ కాలనీ, మధురవాడ ఇలా చెదరిపోయారు. పోర్టు హాస్పిటల్‌లో చికిత్స కోసం ఆయా ప్రాంతాల నుంచి తెల్లవారుజామున బయలుదేరి ఇబ్బంది పడుతూ వస్తుంటారు. వారితోపాటు సహాయకులు కూడా రోజంతా వేచి చూడాల్సిందే.

మందులకు మరో ప్రహసనం..

గతంలో డాక్టర్లు ఏ మందు రాసినా ఇదే హాస్పిటల్‌లోని ఫార్మసీ కౌంటర్ నుంచి వెంటనే ఇచ్చి పంపించేవారు. నేడు కొన్ని యాంటీ బయాటిక్స్ కావాలన్నా కూడా ఇక్కడ దొరకడం లేదు. వాటిని బయట నుంచి రప్పిస్తుంటారు. ఈ మందుల కోసం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి క్యూ కట్టాలి. పుస్తకాలు లైన్‌లో పెట్టాలి. సాయంత్రం 4 గంటల తరువాత మందులు ఇవ్వడం ప్రారంభిస్తారు.

ప్రతి దానికీ రిఫరల్..

ఇప్పుడు ఇక్కడ ఏ సమస్య వచ్చినా.. బయట ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. దీనికోసం కూడా నానా పాట్లు పడి రిఫరల్ లెటర్స్ రాయించుకోవాలి. ఇలా చాలా ప్రక్రియే ఉంది. ఇక టెస్టులకు కూడా ఇదే పరిస్థితి. బయట డయాగ్నోస్టిక్ సెంటర్లకు కొన్ని టెస్టులను రాస్తున్నారు. కారణం ఇక్కడ పరికరాలు లేకపోవడమే. ఇక్కడున్న హాస్పిటల్‌ను, సదుపాయాలను పూర్తిగా నిర్వీర్యం చేసేశారు. దీని కారణంగా రోగులు, వారి సహాయకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వచ్చిన వీపీఏ కొత్త చైర్మన్ దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటే.. ఎంతో మంది నిత్యం ఎదుర్కొంటున్న కష్టాలకు పరిష్కారం దొరుకుతుందని పలువురు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా మ్యూజికల్ చైర్


మ్యూజికల్ చైర్ ఆడుతున్న విద్యార్థులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారుల్లో ఏకాగ్రత పెంచేందుకు మ్యూజికల్ చైర్ ఆడించారు. సుమారు 25 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు అందించారు. ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు, లైబ్రేరియన్ వై.పద్మజ, పూర్వ విద్యార్థి బి.రఘు లక్ష్మి, లైబ్రరీ కమిటీ సభ్యుడు భానుప్రకాష్ పోటీని పర్యవేక్షించారు.

29న పర్యావరణ దినోత్సవ పోటీలు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోటీలను జయప్రదం చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ టీం సంయుక్తంగా పిలుపునిచ్చాయి. ఈ నెల 29న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో డ్రాయింగ్, వ్యాసరచన, ఎలక్యూషన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. 'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై పోటీలు జరుగుతాయని చెప్పారు. చిత్రలేఖనంలో పాల్గొనే వారికి డ్రాయింగ్ షీట్, వ్యాసరచన పోటీలో పాల్గొనే వారికి తెల్లకాగితాలు తామే ఇస్తామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరుగుతాయని, 8 గంటలకు డ్రాయింగ్, 9 గంటలకు వ్యాసరచన, 10 గంటలకు ఎలక్యూషన్, 11 గంటలకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. వివరాలకు 70327 81461, 83338 49955 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జీవీఎల్ దృష్టికి వాకర్స్ సమస్యలు


వాకర్స్‌తో ఎంపీ జీవీఎల్ నరసింహారావు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్స్ వాకర్స్ సభ్యులను గురువారం మార్నింగ్ వాక్‌లో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు కలిశారు. వాకర్స్ పార్కులు ఏర్పాటు చేయాలని, వాకర్ల సమస్యలను పరిష్కరించాలని ఆయనకు సభ్యులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు


సాయిబాబాకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చకుడు వంశీ భక్తుల నామగోత్రాలతో పూజలు నిర్వహించి బాబాకు హారతి సమర్పించారు. ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం రాజాస్వామి మాట్లాడుతూ జూన్ 1న త్రయోదశి సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు రామలింగేశ్వర స్వామికి ప్రదోషకాల అభిషేకం, 4న అమ్మవారికి పౌర్ణమి పూజలు, 7న సాయంత్రం 5.30 గంటలకు మహాగణపతికి సంకష్టహర చతుర్థి అభిషేకాలు, 11న సాయంత్రం 5.30 గంటలకు కాలభైరవ స్వామికి అష్టమి అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వలంటీర్ల సేవలు అమోఘం


సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేయడంలో వార్డు వలంటీర్ల సేవలు అమోఘమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కొనియాడారు. జోన్–3 పరిధి నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపంలో గురువారం 14, 24 వార్డులకు చెందిన వలంటీర్లకు ఆయన చేతుల మీదుగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకు చేరేలా సచివాలయాలను స్థాపించి రోజుల వ్యవధిలోనే పలు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించారన్నారు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా ప్రజలకు పథకాలు అందించేలా నిరుద్యోగ యువతను భాగస్వామ్యం చేస్తూ గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను స్థాపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, కొఠారి అనిల్‌కుమార్‌రాజు, ఏపీడీ దుర్గాప్రసాద్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మురళీకృష్ణారెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి, కె.సుశీల, సీతాకుమారి, బి.రామిరెడ్డి, సీవోలు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, పార్టీ 24వ వార్డు నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ


బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వేసవి తాపం నుంచి బాటసారులకు ఉపశమనం కలిగించేందుకు మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. మాధవధార కుంచుమాంబ ఆలయం పరిసరాల్లో పాదచారులు, పండ్ల వ్యాపారులకు 150 మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ముందుగా క్లబ్ అధ్యక్షురాలు శేషామణి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించి జూన్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సభ్యులు చర్చించారు. క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత, ఉపాధ్యక్షురాలు సీహెచ్ వరలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎ.జయశ్రీ, జాలీ వాకర్ ఎ.మాధవీలత, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, డైరెక్టర్లు మహాలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ ఎస్ లేఅవుట్, 11 కేవీ బీఎస్ లేవుట్, 11 కేవీ ఏపీ ఎస్ఈబీ, 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్లలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్, శ్రీప్రకాష్ స్కూల్, ఎన్ఆర్ఐ హాస్పిటల్ వెనుక ప్రాంతం, బీఎస్ లేఅవుట్, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అక్కయ్యపాలెం సెక్షన్‌లో..

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్, గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ సబ్ స్టేషన్ పరిధిలో హై టెన్షన్ లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఆపరేషన్ ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బీఎండబ్ల్యూ షోరూం ప్రాంతం, షాదీఖానా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కార్మిక శాఖ కార్యాలయం, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని 104 ఏరియా, హ్యాపీ హోమ్స్, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఐటీఐ కూడలి, 104 ఏరియా, సిద్ధార్థనగర్, గణేష్‌నగర్, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, శ్యామ్‌నగర్ కాలనీ, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో..

మర్రిపాలెం: జోన్–2 ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని 11 కేవీ మర్రిపాలెం ఫీడర్ నిర్వహణ ప్రక్రియలో భాగాంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జ్యోతినగర్, గౌతమి గార్డెన్స్, మహారాణి వీధి, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

చిటపట చినుకులు


అక్కయ్యపాలెంలో కురుస్తున్న వర్షం

సీతంపేట: మండే ఎండలతో సతమతమవుతున్న జనానికి చిటపట చినుకులు ఊరటనిచ్చాయి. అసలే రోహిణి కార్తె.. భానుడి ప్రభావంతో ఉక్కిరిబిక్కిరి నుంచి చల్లటి వానతో ఉపశమనం కలిగింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్ర ప్రభావం చూపినా.. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా మారింది. ఆ తర్వాత సాయంత్రం కురిసిన వర్షానికి నగరం చల్లబడింది. జనం సేదతీరారు. అకాల వర్షంతో వాతావరణం ఒక్కసారిగా కూల్ అవ్వడంతో వేసవి తాపం నుంచి జనం ఉపశమనం పొందారు.

వ్యసనాలకు బానిసై వ్యక్తి బలవన్మరణం

గోపాలపట్నం: వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం గొల్ల వీధిలో జరిగింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా.. వెంకటాపురం గొల్ల వీధికి చెందిన గంట్రెడ్డి సాయి కుమార్(30) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం మద్యం తాగి భార్యతో గొడవ పడ్డాడు. ఆమె తన ఇద్దరి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈక్రమంలో మద్యం మత్తులో ఇంట్లో ఫ్యాన్ హుక్‌కు చీర కట్టి సాయి కుమార్ ఉరి వేసుకున్నాడు. గురువారం సాయంత్రం వరకు ఇంటి తలుపులు తీసి ఉండటం, ఎవరూ అలికిడి లేకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కిటికీలో నుంచి చూశారు. ఉరి వేసుకుని సాయికుమార్ కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఇ.నరసింహారావు ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేపట్టారు.

వేసవి శిబిరం సందర్శన

మురళీనగర్: ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శారీరక, మానసిక ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం 49వ వార్డు ప్రత్యేక అధికారి రమణమ్మ సందర్శించారు. ఇక్కడ బాక్సింగ్, వాలీబాల్, క్యారమ్స్ ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు. అనంతరం ప్రతీ రోజు అందిస్తున్న ఆహార పదార్థాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీడీ స్వరూపారాణి, పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఏఎస్ నాయుడు పాల్గొన్నారు.

'కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టేందుకే ప్రైవేటీకరణ'


833వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని, ఉక్కు ఉత్పత్తిని నిలిపేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 833వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రైవేటీకరణను ఆపాలని, సంస్థను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాల అమలు


ఓ గడపలో అవ్వ దీవెనలు అందుకుంటున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 46వ వార్డులో గురువారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంజీవయ్య కాలనీ, సంతోష్‌నగర్ 263 సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరికీ మేలు జరిగేలా అనేక సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారన్నారు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. డిప్యూటీ మేయర్ సతీష్ మాట్లాడుతూ మౌలిక వసతులను అభివృద్ధి చేసి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేలా ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు అప్పారావు, డైరెక్టర్లు శ్రీను, నూకరాజు, వార్డు నాయకులు బి.గోవింద్, చిన్నా, కృష్ణ, దుర్గాభవాని, అప్పలరెడ్డి, రామారావు, ఈశ్వరరావు, బాబ్జీ, హరిపట్నాయక్, రాఘవులు, కృపా, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పిల్లలకు ఎంతో మేలు


వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న జోన్–5 కమిషనర్ కృష్ణ, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: క్రీడలు ఆడటం ద్వారా పిల్లల మానసిక వికాసానికి ఎంతో మేలు జరుగుతుందని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అన్నారు. జీవీఎంసీ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శ్రీమాధవ భారతి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కంచరాన సూర్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం 50వ వార్డు కనకదుర్గా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు సెల్‌ఫోన్‌లు వ్యసనంగా మారిపోయాయని, క్రీడలు అలవాటైతే వాటికి దూరంగా ఉండే అవకాశం ఉంటుందని, తద్వారా భవిష్యత్తులో బాగుంటారన్నారు. కార్పొరేటర్ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల శారీరికంగా దృఢంగా, మానసికంగా ఉల్లాసంగా, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉంటారన్నారు. పిల్లలకు వెయిట్ లిఫ్టింగ్, కరాటే, బాక్సింగ్ వంటివి కోచ్‌లు నేర్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, సనపల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార అంతస్తు తొలగింపు


నర్సింహనగర్‌లో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధి 14వ వార్డు నర్సింహనగర్‌లో అనధికార అంతస్తును పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టీపీఎస్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం సిబ్బంది తొలగించారు. అనధికార వాల్ పోస్టర్లను తీసివేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగా పోస్టర్లు అతికిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అలసత్వం వద్దు

గోపాలపట్నం: పారిశుద్ధ్య నిర్వహణపై అలసత్వం వద్దని సచివాలయ కార్యదర్శులకు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సూచించారు. 52వ వార్డులో గురువారం ఉదయం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణతో కలిసి ఆయన పర్యటించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో కమిషనర్‌కు శ్రీధర్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి రహదారులు, గ్రీన్ బెల్ట్‌ను పరిశీలించారు. గ్రీన్ బెల్ట్‌లో అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్‌ను చూసి చాలా బాగుందని కొనియాడారు. ప్రధాన కాలువలు, ఇంజినీరింగ్ పనులతోపాటు దీర్ఘకాలంగా ఉన్న పాస్‌పోర్ట్ కార్యాలయం నుంచి కరాసాకు వెళ్లే ఎయిర్‌పోర్ట్ స్థలాల్లోని రహదారిని పరిశీలించారు.

పబ్లిక్ డిమాండ్

వేలాడుతున్న కేబుల్ వైర్లు


గురుద్వారా వెనుక రోడ్డులో ప్రమాదకరంగా వేలాడుతున్న వైర్లు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గురుద్వారా వెనుక రోడ్డులో కేబుల్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఆ మార్గంలో వ్యాన్లు, లారీలు రాకపోకలు సాగించే సమయంలో వైర్లకు తగులుతున్నాయి. రాత్రి వేళలో అవి కనిపించకపోవడంతో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలి.

– కె.క్రాంతి, గురుద్వారా

బాబోయ్.. దుర్వాసన!


గురుద్వారా రోడ్డులో చెత్తతో నిండిన డస్ట్ బిన్లు

సీతమ్మధార: గురుద్వారా రహదారి, సీతమ్మధార రైతుబజార్ వెనుక రోడ్డులో చెత్తాచెదారం పడేయడంతో దుర్వాసన వెలువడుతోంది. అక్కడ ఉంచిన డస్ట్ బిన్లు చెత్తతో నిండిపోయాయి. రాకపోకల సమయంలో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి. పశువులు, కుక్కలు వ్యర్థాల వద్ద చేరి చెల్లాచెదురు చేస్తున్నాయి. పారిశుద్ధ్య అధికారులు స్పందించి చెత్త పేరుకుపోకుండా సకాలంలో తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– డి.రాజు, సీతమ్మధార

పందుల సంచారంతో ఇబ్బందులు


వరాహగిరి కాలనీ–2లో సంచరిస్తున్న పందులు

తాటిచెట్లపాలెం: పోర్టు క్వార్టర్స్, వరాహగిరి కాలనీ–2, సత్యసాయినగర్, సింగాలమ్మపురం, కైలాసపురం ప్రాంతాల్లో పందుల బెడద చాలా ఎక్కువైంది. జీవీఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వాటి సంచారం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలి.

– కె.రాము, కైలాసపురం